నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

# నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY




సంపుటి : 13 సంచిక : 126 రంగారెడ్డి | గురువారం 03 సెప్టెంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 03-09-2026 | September | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To:Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada




# ఒడువని ముచ్చట్లు

- కొండా సురేఖ అంశంపై ఢిల్లీలో కీలక భేటీలు
- ఖర్గేతో సీఎం రేవంత్, మీనాక్షి, మహేశ్‌కు గౌడ్ సమావేశం
- కేసీ వేణుగోపాల్‌తో మంత్రి సురేఖ భేటీ
- కుమార్తె సుష్మిత వ్యాఖ్యలపై వివరణ
- ఉత్కంఠ కలిగిస్తున్న వరుస సమావేశాలు

**ఎడతెగని చర్చలు**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండా సురేఖకు సంబంధించిన అంశంపై ఢిల్లీలో వరుసగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో తెలంగాణకు చెందిన ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తదితరులు ఖర్గేతో సమావేశమై రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. మరోవైపు మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె కొండా సుష్మ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఏర్పడిన పరిణామాలపై సురేఖ వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. పార్టీ అంతర్గతంగా ఈ వ్యవహారంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఆమె ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఖర్గేతో మరోసారి సమావేశం

కేసీ వేణుగోపాల్‌తో సురేఖ భేటీ అనంతరం మరో కీలక సమావేశం జరిగినట్లు సమాచారం. ఖర్గే సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి, మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్ గౌడ్, కొండా సురేఖ, కేసీ వేణుగోపాల్ సమావేశమై తాజా పరిణామాలపై చర్చించారు. ఈ సమావేశం గంటకు పైగా జరగడం విశేషం.. ఈ సమావేశం నుంచి మీనాక్షి నటరాజన్ మధ్యలోనే వెళ్లిపోవడం గమనార్హం. మంత్రి సురేఖ అంశంపై పార్టీ నాయకత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలు, పార్టీ ప్రతిష్ఠకు ఇబ్బంది కలగకుండా వ్యవహరించాల్సిన తీరుపై చర్చ జరిగినట్లు సమాచారం.

### రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రస్తుతం మహారాష్ట్ర పర్యటనలో ఉన్న నేపథ్యంలో తెలంగాణ నేతలు ఢిల్లీలో పార్టీ అధిష్ఠానంతో సమావేశం కావడం ప్రాధాన్యతసంతరించుకుంది.ఈపర్యటన ముగించుకుని రాహుల్ వచ్చిన వెంటనే ఈ సమావేశ వివరాలుఆయనకువివరించనున్నట్లు సమాచారం.. ఇక కొండా సురేఖ అంశంతో పాటు రాష్ట్ర కాంగ్రెస్‌లోని తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ నేతల మధ్య సమన్వయం తదితర అంశాలు కూడా సమావేశాల్లో చర్చకు వచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలపై కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. వరుస భేటీల నేపథ్యంలో కొండా సురేఖ అంశంపై పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.

# ఆరు గ్యారంటీలు అమలులో విఫలం

**కేసీఆర్ నిర్మించిన తెలంగాణ వ్యవస్థలను రేవంత్ ప్రభుత్వం కుప్పకూల్చింది**

**ప్రజా సమస్యలపై ఏడు రోజుల ఉద్యమానికి బీఆర్ఎస్ పిలుపు**

నిర్భయవార్త ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తెలంగాణలోని అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రధాన ప్రతిపక్షంగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు పూర్తయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కేసీఆర్ హయాంలో తాగునీరు, సాగునీరు, విద్యుత్, వ్యవసాయం, వైద్యం వంటి రంగాల్లో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, ప్రస్తుతం విద్య, వైద్యం, విద్యుత్, తాగునీరు, శాంతి భద్రతలు సహా అన్ని వ్యవస్థలు క్షీణించాయని ఆరోపించారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ స్థానంలో ఇప్పుడు కరెంట్ సమస్యలు ఎదురవుతున్నాయని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మందులు కూడా అందడం లేదని విమర్శించారు. కేసీఆర్ అభివృద్ధి చేసిన తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తీసుకెళ్తోందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఏడు రోజుల నిరసన కార్యక్రమాలు చేపడతామని, ప్రజల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని హరీశ్‌రావు తెలిపారు.






## కొత్త నిబంధనలతో భారతీయులపై ప్రభావం?

అయితే ఈ నిబంధనలు ప్రస్తుతం ముసాయిదా దశలోనే ఉన్నాయి. అమల్లోకి వస్తే న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. సరైన పత్రాలు లేని వలసదారులు తమ పిల్లల పాస్‌పోర్ట్‌లకు దరఖాస్తు చేసేందుకు వెనుకాడే పరిస్థితి ఏర్పడవచ్చన్న ఆందోళనలు ఉన్నాయి. అమెరికా పౌరసత్వ వ్యవస్థను పరిరక్షించడంతో పాటు అక్రమ వలసలు, 'బర్త్ టూరిజం'ను అరికట్టడమే తమ లక్ష్యమని ట్రంప్ ప్రభుత్వం చెబుతోంది. ఈ మార్పులతో భారతీయులపై ఎక్కువ ప్రభావం పడే అవకాశం ఉందని అక్కడి వర్గాలు చెబుతున్నాయి.

# పేదల సంక్షేమం, యువత ఉపాధే ప్రభుత్వ లక్ష్యం

**సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధనకు కృషి**

**ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి భావోద్వేగ సందేశం**

**నాలుగు కోట్ల ప్రజల ఆశీస్సులతో తెలంగాణను విశ్వ వేదికపై నిలబెడతాం**

**వెయ్యి రోజుల ప్రయాణంలో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ సీఎం కృతజ్ఞతలు**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల ప్రజా పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా భావోద్వేగ సందేశాన్ని షేర్ చేశారు. ప్రజల ఆకాంక్షలను కేంద్రంగా చేసుకుని, తెలంగాణ ఉద్యమ త్యాగాల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ వెయ్యి రోజుల పాలన ప్రజలతో మమేకమై సాగిన ప్రజా ప్రస్థానమని సీఎం అభివర్ణించారు. ప్రజల అవసరాలు, వారి ఆశలు, ఆకాంక్షలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రాతిపదికగా ఉన్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. పేదల సంక్షేమంతో పాటు వారి ఆత్మగౌరవాన్ని కాపాడేలా పథకాలు, కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు.


నిర్భయవార్త ప్రతినిధి :

### సామాజిక న్యాయమే లక్ష్యం

సకల వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్య మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వం, ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని పేర్కొన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆశీస్సులు, లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల అండతో రాష్ట్రాన్ని విశ్వ వేదికపై విజయపతాకగా నిలిపే వరకు అవిశ్రాంతంగా కృషి చేస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం రంగాల్లో దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

# 22ఎ భూములపై అసెంబ్లీలో ఏం మాట్లాడతారో రండి..

**బీఆర్ఎస్‌కి పొంగులేటి సవాల్**



హైదరాబాద్, నిర్భయవార్త ప్రతినిధి :22ఎ భూములపై అసెంబ్లీలో చర్చిద్దామని.. బీఆర్ఎస్ నేతలు సభలో ఏం మాట్లాడతారో మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సవాల్ చేశారు. 22ఏ భూములను అడ్డుపెట్టుకుని దందాలు చేస్తామంటే కుదరదని హెచ్చరించారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ప్రతిపక్ష పాత్రను విస్మరించాయని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వెయ్యి రోజులు పూర్తి చేసుకుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, పెట్టిన బకాయిలు తాము చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. యాస, భాషలతో ప్రజలను మభ్య పెట్టలేరని అన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ బకాయిలను తామే చెల్లించామని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో సర్పంచ్‌లకు పెట్టిన బకాయిలను కూడా తామే చెల్లించామని పేర్కొన్నారు.

### వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం..

'మా పాలనలోని వెయ్యి రోజుల్లో రూ.1.76లక్షల కోట్లను రైతులకు ఇచ్చాం. ఆనాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అన్నారు.. మేము వరికి క్వింటాకు రూ.500 బోనస్ ఇచ్చాం. ప్రజలను కావాలని మా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా బీఆర్ఎస్‌కు జ్ఞానోదయం కాలేదు. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా గులాబీ పార్టీకి జ్ఞనం రాలేదు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓడించాం. అయినా వారిలో మార్పు రాలేదు. ఆనాడు బతుకమ్మ చీరల్లో అవినీతికి పాల్పడ్డారు. రాహుల్ గాంధీని విమర్శిస్తావా కేటీఆర్..?. సంస్కార హీనంగా మాట్లాడితే ప్రజలు క్షమించరు. అధికారంలోకి వస్తామని మీరు కలలు కంటూనే ఉండండి. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను మేము నిర్మిస్తున్నాం.

నిర్భయవార్త

సంపాదకీయం

గురువారం 03 సెప్టెంబర్ 2026

# జెన్‌జీని మోదీ జయించగలరా?

'నిలదొక్కుకోవాలంటే తడబడడం అవసరం' అని ఒక కవి అన్నారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం అదే దారిలో ఉన్నట్లు కనిపిస్తోంది. జూలై 20--25 తేదీల మధ్య దేశవ్యాప్తంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను బుట్టదాఖలు చేయాలని, తదుపరి దర్యాప్తులు చేయరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశించడంతో... దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో సెప్టెంబర్ 5న పెల్లుబుకాల్సిన మరో అల్లకల్లోలం సమసిపోయినట్లేనని భావించవచ్చు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో ఢిల్లీలో జరగాల్సిన బ్రిక్స్ సమ్మిట్ నేపథ్యంలో మరోసారి శాంతిభద్రతల సమస్య తలెత్తవచ్చునని కేంద్రం భావించినందువల్లే సామరస్య వైఖరిని అవలంబించక తప్పలేదని స్పష్టమవుతోంది. ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తామని, నీట్ పేపర్ లీక్‌లతో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లిస్తామని సీజేపీ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకుని నెల రోజులు దాటింది. అయితే కేంద్రం ఎంతకూ ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల దినోత్సవం రోజున ఇండియా గేట్ నుంచి ఢిల్లీ పోలీసు హెడ్ క్వార్టర్స్ దాకా నిరసన ప్రదర్శన నిర్వహిస్తామని సీజేపీ ప్రకటించింది. దీంతో న్యూఢిల్లీలో పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహితలోని సెక్షన్ 163 కింద అనుమతిలేని అన్ని సమావేశాలను పూర్తిగా నిషేధించారు. ఈ నిరసన ప్రదర్శనపై నిషేధం విధించాలని ఒక రిటైర్డ్ పోలీసు అధికారి ద్వారా సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా దాఖలు చేయించారు. సాధారణంగా అయితే పెద్ద ఎత్తున బలగాలను తరలించి, న్యూఢిల్లీని యుద్ధ క్షేత్రంగా మార్చి, ఇంటర్నెట్ సదుపాయాలను నిలిపివేసి, విద్యార్థుల ప్రదర్శనను తొక్కివేయగల శక్తి మోదీ సర్కార్‌కు ఉన్నది. విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత కూడా వారిని డిజిటల్ ఆధారాలతో గుర్తించి వేధించడం కేంద్రం సహజ వైఖరికి నిదర్శనం. ఆ సమయంలో పెల్లెట్ల ప్రయోగం, ఇతర దారుణాలపై అనేక సంస్థలు కోర్టుకు వెళ్లడంతో ఉన్నత స్థాయి కమిషన్‌ను నియమించాల్సి వచ్చింది. అయినప్పటికీ విద్యార్థులు ప్రభుత్వ నిజాయితీని శంకించవలసిన పరిస్థితులు తలెత్తాయి. అయితే ఒక అంతర్జాతీయ శిఖరాగ్ర సదస్సు సమయంలో పోలీసులు స్వైర విహారం, హింసాకాండ మూలంగా విదేశీ ప్రతినిధులకు అసౌకర్యం కలిగించడమే కాక, అంతర్జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్న ఆందోళనతో ప్రభుత్వం పట్టువిడుపుల ధోరణిని ప్రదర్శించక తప్పలేదు. నిరసన ప్రదర్శనను తాము నిషేధించే ప్రసక్తి లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన మర్నాడే విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను రద్దు చేయాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులు దరఖాస్తులు పెట్టుకున్నారు. విద్యార్థులపై కేసులు ఉపసంహరించుకుంటామని, ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలలలోగా నష్టపరిహారం చెల్లిస్తామని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు విన్నవించుకున్నారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తన అసాధారణ ప్రత్యేకాధికారాలను ఉపయోగించుకుని విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని సుప్రీంకోర్టు ఆదేశించడం, తాము నిరసన ప్రదర్శనను ఉపసంహరించుకుంటున్నామని సీజేపీ ప్రతినిధులు ప్రకటించడంతో పరిస్థితులు సద్దుమణిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలతో జూన్--జూలై నెలల్లో జరిగిన విద్యార్థుల నిరసన ప్రదర్శనల ప్రకంపనలు దేశంలో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని అర్థమవుతోంది. ఢిల్లీలో జరిపిన నిరసన ప్రదర్శనలతో ఆగకుండా సీజేపీ దేశంలోని అనేక రాష్ట్రాల్లో ప్రజా సమస్యలపై ఆందోళనలకు ఉపక్రమించింది. ప్రభుత్వ విధానాల సమీక్ష, స్కూళ్లలో మౌలిక సదుపాయాల పరిస్థితులు, ప్రశ్నపత్రాల లీక్ సమస్యలు, పరీక్షల నిర్వహణలో లోపాలు, టీచర్ల పోస్టుల ఖాళీలు, నిరుద్యోగం, పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం వంటి సమస్యలపై మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, కర్ణాటక, ఢిల్లీలలో ఆందోళనలు నిర్వహించారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న స్కూళ్లకు వెళ్లి 'స్కూల్ ఠీక్ కరో' ఉద్యమాన్ని ప్రారంభించారు. జాతీయ వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేసి 'క్యాబోల్తీ హై పబ్లిక్' పేరుతో దేశవ్యాప్త పర్యటనలు ప్రారంభించడంతో సీజేపీకి ఏదో బృహత్తర లక్ష్యం ఉన్నట్లు భావించక తప్పడం లేదు. సీజేపీ లక్ష్యం ఏదైనా, దాని భవిష్యత్తు ఎలా ఉన్నప్పటికీ, తీవ్ర ఒత్తిడి వస్తే తప్ప తన వైఖరి మార్చుకునే ధోరణి కేంద్రంలో కనపడకపోవడం సాధారణంగా మారింది. విద్యార్థుల ఆందోళన తారస్థాయికి చేరుకున్న తర్వాతే విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామా చేయించారు. ఇప్పుడు ఇండియాగేట్ నుంచి ర్యాలీ చేస్తామని హెచ్చరించిన తర్వాతగానీ విద్యార్థులపై ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకునేందుకు ప్రభుత్వం దిగిరాలేదు. ఎందుకు ప్రతి సమస్యనూ తెగేదాకా లాగి ఆ తర్వాత వెనక్కి తగ్గడం? ప్రతిసారీ ప్రభుత్వ పరువును కాపాడేందుకు సర్వోన్నత న్యాయస్థానం ముందుకురాలేదు కదా! దాని పరిమితులు దానికి ఉన్నాయి. ఎందుకో సమస్యలను పరిష్కరించడంలో, లేదా అంచనా వేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమవుతోందనే అనుమానాలు కలుగుతున్నాయి. సమస్యలను పరిష్కరించేందుకు ఒక మేధో యంత్రాంగాన్ని రూపొందించుకోలేకపోవడం, కేవలం బల ప్రయోగాన్నే నమ్ముకోవడమే ఇందుకు కారణం కావచ్చున్న అభిప్రాయం కలుగుతోంది. పన్నెండు సంవత్సరాల పరిపాలన తర్వాత దేశంలో చెప్పుకోదగ్గ స్థాయిలో, అది కూడా విద్యార్థుల నుంచి మోదీ సర్కార్ ఎందుకు ప్రతిఘటనను ఎదుర్కోవాల్సి వస్తోంది? కొత్త తరం ఇప్పుడు ప్రతి నిర్ణయాన్నీ ప్రశ్నిస్తోంది. వ్యవస్థల్లో లోపాల్ని ఎత్తిచూపుతోంది. వారికి మద్దతుగా కాంగ్రెస్‌తో పాటు ఇతరేతర శక్తులు కూడా తోడవుతున్నాయి. అంతమయ్యాయనుకున్న రకరకాల వామపక్షాలు కూడా ఇప్పుడు అత్యుత్సాహంతో తమ వంతు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయి. సోషల్ మీడియా ఉపయోగంలో ఈ అన్ని శక్తులూ కలిసికట్టుగా విజృంభిస్తున్నాయి. ఎస్ఎఫ్ఐ వంటి విద్యార్థి సంఘాల నేతలే కాదు, బిహార్‌లో తన ఉనికి కోసం పోరాడుతున్న సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) వంటి పార్టీ కూడా తమ విద్యార్థి సంఘం నాయకురాలు నేహా బోరా ద్వారా జరుగుతున్న పరిణామాలను, బీజేపీని ఎండగట్టేందుకు ఉపయోగించుకుంటున్నదంటే అన్ని వామపక్ష శక్తులూ ఎలా సంఘటితమవుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుత పరిస్థితులను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు ఈ శక్తులు ప్రయత్నించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అవి విజయం సాధించగలవా అన్నది చెప్పలేము కానీ కమలనాథులు మాత్రం ఆత్మరక్షణలో పడ్డారనడంలో సందేహం లేదు.

# రోహిణి కమిషన్: ఆరేళ్ల విచారణ... మూడేళ్లుగా మౌనం!

**ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ ప్రయోజనాలు అందడం లేదంటే... కేంద్రం ఇంకా ఎందుకు మౌనం వహిస్తోంది?**

భారతదేశంలో రిజర్వేషన్లు కేవలం శాతాల లెక్క కాదు. చారిత్రకంగా విద్య, ఉద్యోగాలు, సామాజిక అవకాశాలకు దూరమైన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం వాటి ప్రధాన ఉద్దేశం. అయితే, రిజర్వేషన్ ప్రయోజనాలు రిజర్వేషన్ పొందుతున్న అన్ని వర్గాలకు సమానంగా చేరుతున్నాయా అన్న ప్రశ్న ఇప్పుడు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ప్రశ్నకు సమాధానం వెతికేందుకే కేంద్ర ప్రభుత్వం 2017 అక్టోబర్ 2న రాజ్యాంగంలోని ఆర్టికల్ 340 కింద రోహిణి కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి. రోహిణి అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్, ఇతర వెనుకబడిన తరగతులు --- ఓబీసీల --- రిజర్వేషన్‌లో ఉపవర్గీకరణను పరిశీలించింది. అసలు ప్రశ్న సూటిగా ఉంది: ఓబీసీలకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర విద్యాసంస్థల్లో లభిస్తున్న 27 శాతం రిజర్వేషన్ ప్రయోజనాలు అన్ని వర్గాలకు సమానంగా అందుతున్నాయా? లేక కొన్ని బలమైన, రాజకీయంగా ప్రభావవంతమైన వర్గాలకే అధిక ప్రయోజనం దక్కుతోందా?

## రిజర్వేషన్‌లోనే అసమానత?

మండల్ కమిషన్ సిఫారసుల అమలు, 1992లో సుప్రీంకోర్టు ఇంద్రా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు నేపథ్యంలో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ అమల్లోకి వచ్చింది. కానీ ఓబీసీలు ఒకే సామాజిక వర్గం కాదు. వేలాది కులాలు, ఉపకులాలు ఇందులో ఉన్నాయి. వాటి విద్యా స్థాయి, ఆర్థిక పరిస్థితి, సామాజిక వెనుకబాటుతనం, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాల్లో వాటా ఒకేలా లేవు. కొన్ని వర్గాలు రిజర్వేషన్ ప్రయోజనాలను పదేపదే పొందుతుంటే, మరికొన్ని వర్గాలకు తక్కువ లేదా అసలు ప్రాతినిధ్యం లేకపోతే, ఆ వ్యవస్థను నిజమైన సామాజిక న్యాయంగా ఎలా పరిగణించాలి? ఇదే రోహిణి కమిషన్ ముందున్న ప్రధాన ప్రశ్న. కమిషన్ లక్ష్యం మొత్తం 27 శాతం కోటాను పెంచడం లేదా తగ్గించడం కాదు. ఆ కోటాను ఓబీసీల్లోని వివిధ ఉపవర్గాలకు మరింత సమానంగా పంపిణీ చేయాలా అన్నదే దాని పరిశీలన. అంటే ఇది రిజర్వేషన్‌కు వ్యతిరేకమైన ఆలోచన కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు నిజంగా అత్యంత వెనుకబడిన వర్గాలకు చేరుతున్నాయా? అన్నదే అసలు పరీక్ష.

## కొద్దిమందికే ఎక్కువ ప్రయోజనమా?

కేంద్ర ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు తదితర సంస్థల్లో ఓబీసీ వర్గాల ప్రాతినిధ్యాన్ని కమిషన్ పరిశీలించింది. కమిషన్ అధ్యయనంలో రిజర్వేషన్ ప్రయోజనాల పంపిణీలో గణనీయమైన అసమానతలు ఉన్నట్లు వెల్లడైనట్లు నివేదికలు సూచించాయి. కొద్దిమంది ఓబీసీ వర్గాలు అధిక ప్రయోజనం పొందగా, పెద్ద సంఖ్యలోని ఇతర వర్గాలకు తక్కువ లేదా దాదాపు ఎలాంటి ప్రాతినిధ్యం లభించలేదనే అంశం చర్చకు వచ్చింది. ఇది నిజమైతే, ప్రశ్న రిజర్వేషన్ అవసరమా కాదా అనేది కాదు. రిజర్వేషన్ ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయి? అన్నదే అసలు ప్రశ్న.

## గణాంకాల గందరగోళం

అయితే ఇక్కడ ఒక తీవ్రమైన సమస్య ఉంది --- నమ్మదగిన కులాల వారీ గణాంకాల కొరత. భారతదేశంలో చివరిసారిగా సమగ్ర కుల గణన 1931లో జరిగింది. 2011 సామాజిక-ఆర్థిక, కుల గణనలో కుల సమాచారాన్ని సేకరించినప్పటికీ, ఓబీసీలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విధాన రూపకల్పనకు అనువుగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. అందువల్ల ఒక ముఖ్యమైన ప్రశ్న తలెత్తుతుంది: వ్యక్తిగత ఓబీసీ వర్గాల జనాభా, విద్య, ఆర్థిక పరిస్థితి, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం ఎంత అనేది స్పష్టంగా తెలియకుండా రిజర్వేషన్‌ను ఎలా న్యాయంగా పునర్విభజించాలి? అదే సమయంలో మరో ప్రశ్న కూడా ఉంది: పూర్తి స్థాయి గణాంకాలు లేవనే కారణంతో, ఇప్పటికే కనిపిస్తున్న అసమానతలను సరిచేయడానికి చర్యలను నిరవధికంగా వాయిదా వేయాలా? డేటా విధాన నిర్ణయాలను మెరుగుపరచాలి. విధాన నిర్ణయాలను స్తంభింపజేయకూడదు.

## 14 సార్లు గడువు పొడిగింపు

రోహిణి కమిషన్ ప్రయాణమే ఈ అంశం ఎంత క్లిష్టమైనదో తెలియజేస్తుంది. మొదట స్వల్ప వ్యవధిలో నివేదిక ఇవ్వాల్సిన కమిషన్ గడువు పదేపదే పొడిగించబడింది. మొత్తం 14 సార్లు గడువు పొడిగించినట్లు సమాచారం. చివరకు దాదాపు ఆరేళ్ల అనంతరం, 2023 జూలై 31న జస్టిస్ రోహిణి తన నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించారు. కానీ నివేదిక సమర్పణతో సమస్య పరిష్కారం కాలేదు. ఇక్కడే అసలు ప్రశ్న: కమిషన్‌ను ఏర్పాటు చేసిన ప్రభుత్వం, నివేదిక వచ్చిన తర్వాత దానిపై స్పష్టమైన నిర్ణయం ఎందుకు ప్రకటించడం లేదు? కమిషన్ పరిశీలించగలదు. గణాంకాలను సేకరించగలదు. సిఫారసులు చేయగలదు. కానీ వాటిని విధానంగా మార్చేది మాత్రం రాజకీయ సంకల్పం.

## క్రీమీ లేయర్ వేరు... ఉపవర్గీకరణ వేరు

ఓబీసీ చర్చలో తరచూ రెండు వేర్వేరు అంశాలు కలిసిపోతాయి --- క్రీమీ లేయర్, ఉపవర్గీకరణ. క్రీమీ లేయర్ విధానం ద్వారా ఓబీసీల్లో సామాజికంగా, ఆర్థికంగా ముందున్న వ్యక్తులు, కుటుంబాలను రిజర్వేషన్ నుంచి మినహాయిస్తారు. ఉపవర్గీకరణ మాత్రం ఓబీసీలకు కేటాయించిన 27 శాతం కోటాను వివిధ సమాజాల మధ్య ఎలా సమానంగా పంపిణీ చేయాలన్నది. ఒకటి వ్యక్తి లేదా కుటుంబ స్థాయిలో పనిచేస్తే, మరొకటి సామాజిక వర్గాల స్థాయిలో పనిచేస్తుంది.

## చట్టం కంటే రాజకీయమే పెద్ద అడ్డంకా?

2024 ఆగస్టు 1న స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ దవీందర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం, షెడ్యూల్డ్ కాస్ట్స్‌లో ఉపవర్గీకరణకు రాష్ట్రాలకు అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పు నేరుగా ఓబీసీలకు సంబంధించినది కాదు. అయినప్పటికీ, రిజర్వేషన్ కేటగిరీలలో అంతర్గత అసమానతలను గుర్తించి, వాస్తవ సమానత్వం కోసం ఉపవర్గీకరణ చేయవచ్చా అన్న చర్చకు ఇది కొత్త బలం ఇచ్చింది. అయితే అసలు అడ్డంకి చట్టం మాత్రమే కాదు --- రాజకీయాలు కూడా. 27 శాతం కోటాను పునర్విభజిస్తే కొందరు వర్గాలకు ప్రయోజనం, మరికొందరికి నష్టం కలగవచ్చు. ఇప్పటికే అధిక ప్రయోజనాలు పొందుతున్న వర్గాలు తమ వాటాను తగ్గించడానికి వ్యతిరేకించవచ్చు. అత్యంత వెనుకబడిన వర్గాలు మాత్రం తమకు ప్రత్యేక వాటా కోరవచ్చు. కానీ సామాజిక న్యాయాన్ని కేవలం ఎన్నికల గణితంగా మార్చకూడదు.


## ఇక నిర్ణయం తీసుకోవాల్సిన సమయం

రోహిణి కమిషన్ ఒక కీలక ప్రశ్నను మన ముందుంచింది: ఒకే కేటగిరీలో ఉన్న ప్రతి వర్గానికి ఒకే కోటా ఇవ్వడం సమానత్వమా? లేక వాస్తవ అసమానతలను గుర్తించి, అవసరమైన చోట భిన్నమైన అవకాశాలు కల్పించడమే నిజమైన సమానత్వమా? కేంద్ర ప్రభుత్వం రోహిణి కమిషన్ నివేదికపై తన వైఖరిని స్పష్టంగా ప్రకటించాలి. నివేదికను ప్రజా చర్చకు అందుబాటులోకి తీసుకురావాలి. అవసరమైన గణాంకాలను పారదర్శకంగా వెల్లడించాలి. రాష్ట్రాలు, ఓబీసీ సంఘాలు, రాజ్యాంగ నిపుణులు, సామాజిక శాస్త్రవేత్తలతో విస్తృత సంప్రదింపులు జరపాలి. 2023లో నివేదిక సమర్పించబడింది. 2026లో కూడా ప్రశ్న అలాగే ఉంది. ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన వర్గాలు నిజంగా రిజర్వేషన్ ప్రయోజనాలను పొందుతున్నాయా? లేక రిజర్వేషన్ అనే తలుపు తెరిచి ఉన్నప్పటికీ, దాని తాళం కొద్దిమంది చేతుల్లోనే ఉందా? రిజర్వేషన్ ఉద్దేశం తలుపులు తెరవడం. ఆ తలుపులు అందరికీ సమానంగా తెరుచుకునేలా చేయడం --- అదే రోహిణి కమిషన్‌కు అసలు అర్థం.

**డా. ముచ్చుకోట సురేష్ బాబు.**

# గిరిజనులకు మేలు చేయని 1/70

షెడ్యూల్డ్ ఏరియాల్లో గిరిజనులు స్వేచ్ఛగా జీవించడానికి, వారి సంస్కృతి, సంప్రదాయాలు, ఆస్తులు, జీవన విధానాన్ని పరిరక్షించడానికి 1/70 చట్టాన్ని తీసుకువచ్చారు. కానీ ఈ యాభయ్యేళ్లలో అది గిరిజనులకు ఏ మేరకు ఉపయోగపడింది అన్నది ఇంకా ప్రశ్నగానే మిగిలి ఉన్నది. 1970 తర్వాత ఈ చట్టం గిరిజనులకు ఒక్క ఎకరం భూమినైనా పెంచగలిగిందా? అన్న ప్రశ్నకు మనం జవాబు ఆలోచించాలి. 1970 తర్వాత అడవిని కొట్టి కొత్తగా సాగులోకి తెచ్చుకున్న భూమిని పక్కనపెడితే, ఈ అయిదు దశాబ్దాల్లో గిరిజనేతరుల నుంచి చట్టబద్ధమైన క్రయవిక్రయాల ద్వారా గిరిజనులకు కొత్తగా సంక్రమించిన భూమి చాలా తక్కువ. అదే సమయంలో గిరిజనేతరుల మధ్య, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, ఒప్పందాలు, ఇతర మార్గాల ద్వారా పెద్ద ఎత్తున భూలావాదేవీలు జరిగాయన్నది వాస్తవం. ఈ వ్యవహారాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అక్రమంగా పెద్ద ఎత్తున సంపాదించుకున్నారన్నది బహిరంగ రహస్యం. 1/70 చట్టం ఒకవైపు గిరిజన భూములు గిరిజనేతరులకు వెళ్లకుండా అడ్డుకున్నది నిజమే కానీ, మరోవైపు గిరిజన రైతు తన భూమికి అవసరమైన సమయంలో సరైన విలువ పొందడానికి అడ్డంకిగా మారింది. గిరిజనుల భూమిని రక్షించాల్సిన 1/70 చట్ట సవరణ, అమలులో మాత్రం గిరిజన రైతుల ఆర్థిక స్వేచ్ఛకే పరిమితులు విధించే వ్యవస్థగా మారింది. పక్కనే 1/70 అమలు కాని మండలాల్లో వ్యవసాయ భూమి ఎకరానికి రూ.40--50 లక్షల వరకు విలువ పలికే పరిస్థితులు ఉన్నప్పుడు, 1/70 చట్ట పరిధిలోని ప్రాంతాల్లో అదే స్థాయి భూమి విలువ రూ.10 లక్షల లోపే ఉంది, అదే గిరిజనుల భూమి అయితే అంతకంటే తక్కువే. దీనికి ప్రధాన కారణాల్లో ఒకటి భూమి బదలాయింపుపై ఉన్న చట్టపరమైన ఆంక్షలు. అయితే తక్కువ ధరకు భూమి దొరుకుతుంది కదా అని ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఆర్థికంగా మంచి స్థితికి చేరిన గిరిజనులు సైతం 1/70 ఏరియాలో భూములు కొనడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. భవిష్యత్తులో అవసరం వచ్చినప్పుడు తాము కొనుగోలు చేసిన భూమిని తిరిగి అమ్ముకోలేమనే భయమే దానికి కారణం. ఇది గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛపై తీవ్రమైన చర్చకు దారితీసే అంశం. వ్యవసాయ భూమి రైతుకు కేవలం జీవనాధారం మాత్రమే కాదు. అది కుటుంబానికి ఆధారం. తమ ముందు తరతరాలకు ఆధారం. కష్టకాలంలో ఆర్థిక భద్రత. పిల్లల భవిష్యత్తుకు భరోసా. వ్యాపారం చేయడానికి పెట్టుబడి. అవసరమైనప్పుడు ఆర్థిక అభివృద్ధిలో ఒక అడుగు ముందుకు వేయడానికి మూలధనం.




అలాంటి పరిస్థితిలో ఒక గిరిజన లేదా గిరిజనేతర రైతు తను సొంతంగా సంపాదించిన లేదా వారసత్వంగా వచ్చిన భూమిని తన అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే లేదా, వారసులకు అందించే విషయంలో ఈ చట్టం గిరిజన/గిరిజనేతరుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తుంది, స్వేచ్ఛాయుత క్రయవిక్రయాల నిషేధం ఏ విధంగా న్యాయ సమ్మతం? గిరిజన ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి అవకాశాలు లేకుండా చేయడం, ఉపాధి అవకాశాలు రాకుండా చేయడం, భూమిని ఆర్థిక ఆస్తిగా వినియోగించుకునే మార్గాలను పూర్తిగా మూసివేయడం ద్వారా గిరిజనులను అభివృద్ధి చేశామని ప్రభుత్వాలు భావిస్తే, దానికంటే శోచనీయమైన విషయం మరొకటి ఉండదు. రక్షణ అంటే అభివృద్ధిని అడ్డుకోవడం కాదు; గిరిజనుడి హక్కును కాపాడుతూ, అతనికి అభివృద్ధి అవకాశాలను కల్పించడం. గిరిజనుల భూమిని కాపాడటమన్న 1/70 చట్టం ఉద్దేశాన్ని ఎవరూ వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. కానీ 55 సంవత్సరాల తర్వాత మారిన పరిస్థితులకు అనువుగా ఈ చట్టాన్ని సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. ఈ చట్టం గిరిజనుల భూమిని ఎంతవరకు కాపాడింది? గిరిజనుల ఆర్థిక స్థితిని ఎంతవరకు మెరుగుపరిచింది? వారి భూమి విలువను ఎంత పెంచింది? భూ బదలాయింపుపై ఆంక్షల వల్ల గిరిజనులకు జరిగిన మంచీ చెడూ ఏమిటి? ఈ అంశాలన్నిటిపైనా లోతైన సమీక్ష జరగాలి. గిరిజనుల భూమిని రక్షించాలి. అదే సమయంలో గిరిజనుల ఆర్థిక స్వేచ్ఛను కూడా రక్షించాలి.

**మంథనపు రామారావు**

# ఏజెన్సీ ఏరియాలోని గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలి

**డి ఎం హెచ్ ఓ డాక్టర్ తుకారం రాథోడ్**

**భద్రాచలం డిఎంహెచ్వో సైదులు వైద్య బృందం..**







భద్రాచలం సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. వర్షాకాలం నడుస్తున్నందున ఏజెన్సీ ఏరియాలోని గిరిజన గ్రామాలలో వైరల్ ఫీవర్ తో పాటు డెంగ్యూ మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సంబంధిత మెడికల్ ఆఫీసర్లు వైద్య సిబ్బంది ప్రత్యేక ప్రణాళికల రూపొందించుకొని అమలు చేయడం వలన సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని జిల్లా వైద్యాధికారి తుకారం రాథోడ్ అన్నారు. బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి మలేరియా అధికారులు మరియు ఎల్ టి ఎస్ ఎం టి ఎస్ టెక్నికల్ అసిస్టెంట్లతో గిరిజన గ్రామాలలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలలో దోమలు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని దోమలు ప్రభావం వల్ల మలేరియా డెంగు వ్యాధులు వ్యాప్తి చెంది గిరిజనులకు శారీరకంగా కాక ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా చూడవలసిన బాధ్యత మనపై ఉన్నందున ఏజెన్సీ ఏరియాలోని పీహెచ్ లలో పనిచేసే వైద్య సిబ్బందితో పాటు మలేరియా అధికారులు ఇంటింటికి తిరిగి గిరిజనులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. ఏజెన్సీ ఏరియాలోని అన్ని సమస్యాత్మక గ్రామాలలో మొదటి విడతగా ఇంటీరియల్ రెసిడెన్షియల్ స్ప్రే చేయాలని, తదుపరి 30 రోజుల వ్యవధిలో రెండవ విడత అల్ప శెపో మిథ్రీన్ మందు స్ప్రే చేయాలని అన్నారు.దీనికి సంబంధించిన పూర్తి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత మెడికల్ అధికారులకు ఆదేశించారు. అనంతరం అన్ని ప్రయోగశాల సేవల పనితీరు వివిధ కార్యకలాపాల పురోగతిని సమీక్షించడానికి సాంకేతిక నిపుణులు మరియు నాణ్యమైన ప్రయోగశాల సేవలు, రికార్డుల సక్రమ నిర్వహణ, ప్రామాణిక విధానాలకు కట్టుబడి, శాఖాపరమైన సూచనలను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన సూచనలను ప్రయోగశాల సాంకేతిక నిపుణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఎంహెచ్వో సైదులు డిప్యూటీ డిఎంహెచ్వో శ్రీధర్ మలేరియా సెక్టర్ అధికారి నగేష్ మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ ల్యాబ్ టెక్నికల్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు..

# నిత్యవసర ధరలు తగ్గించాలని మాస్ లైన్ ఆధ్వర్యంలో నిరసన

**దిద్దుబాటు చర్యల్లో మోడీ సర్కార్ వైఫల్యం.**

**సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్.**




సింగరేణి సెప్టెంబర్ 2 నిర్భయవార్త రిపోర్టర్. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ముఖ్యంగా వంట నూనెల ధరలు అంటకాగుతున్నాయి. చక్కెర చేదెక్కింది. బియ్యం, ఉప్పు, పప్పులతో పాటు కూరగాయల ధరలు కూడా భగ్గుమంటున్నాయి. మరోవైపు డీజిల్, పెట్రోల్ రేట్లు రోజువారీగా పెరుగుతూనే ఉన్నాయి. సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆవుల అశోక్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ ఆవేదన వ్యక్తం చేశారు. కారేపల్లి సెంటర్లో పార్టీ జిల్లా కమిటీ పిలుపులో భాగంగా మాస్ లైన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన ఉద్దేశించి వారు మాట్లాడుతూ వంటగ్యాస్ ధరలు సైతం ఏ నెలకు ఆ నెల పెరుగుతూనే ఉన్నాయి. ఈ ధరల మంటను నియంత్రించడంలో కేంద్రంలోని మోడీ సర్కార్ ఘోరంగా విఫలమౌతున్నది. వారన్నారు. కేంద్రం సామాన్యుడిపై మితిమీరిన ఆర్థిక భారాలు మోపుతున్నదని ఆర్థికరంగ నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారని వారన్నారు . కేంద్రం వైఫల్యం ధరల నియంత్రణలో కేంద్రంలోని మోడీసర్కారు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తున్నది. సామాన్యుల వంటింటి ఆర్థిక కష్టాలను ఏమాత్రం నియంత్రించలేకపోతోంది. అయితే ఈ ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు ఎల్నినో సాకును ప్రధానంగా చూపుతున్నారు. పంటల దిగుబడి తగ్గిందని ప్రచారం చేస్తున్నారు. దానివల్లే ధరలు పెరుగుతున్నాయని . డీమార్ట్, రిలయన్స్ వంటి కార్పొరేట్ దిగ్గజ సంస్థలు లక్షల టన్నుల ధాన్యాలను గిడ్డంగుల్లో అక్రమంగా నిల్వ ఉంచి, బహిరంగ మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. వాటిని విడిపించే కనీస ప్రయత్నం కేంద్రం వైపు నుంచి జరగట్లేదు. పైపెచ్చు దేశంలో నిత్యవసరవస్తువుల కొరతను సాకుగా చూపుతూ విదేశాల నుంచి ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతులు చేసుకొనేందుకు అవకాశాలు కల్పిస్తున్నది. అలా వచ్చిన సరుకు కూడా మళ్లీ కార్పొరేట్ల గోడౌన్లలోకే చేరుతున్నాయని అన్నారు. కారేపల్లి మండలంలో కోతులు పంటలను నష్టపరుస్తున్నాయని ఇళ్లలో సైతం దాడి చేస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు కోతుల నియంత్రణకు తగిన ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు సమయానికి పూర్తిచేసిన ఫైనల్ బిల్లు పడకుండా పెండింగ్ పెట్టి పేదలను ఇబ్బంది పెట్టడం సరికాదని ఆయన సందర్భంగా ప్రభుత్వాన్ని సూచించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గుగులో తేజ నాయక్ , మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి రాకేష్, అనుసూర్య, సత్తిరెడ్డి, దోమల సీత ,శ్రీను ,సక్రు, రావుల నాగేశ్వరరావు, నాగేశ్వరరావు ,వెంకటేశ్వర్లు ,బుచ్చయ్య, గుమ్మడి ఎర్రయ్య, సీతారాములు తదితరులు పాల్గొన్నారు..

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ.... ఎం ఈ ఓ..







భద్రాచలం సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం మండలం పరిధిలోని లంబాడి కాలనీలో ప్రాథమిక పాఠశాలలో బుధవారం మండల విద్యాశాఖ అధికారి సందర్శించి వారి చేతులమీదుగా విద్యార్థులందరికీ నూతన యూనిఫామ్ ని పంపిణీ చేశారు. అనంతరం ఎంతో ఆనందంగా విద్యార్థులందరూ యూనిఫామ్ ధరించి మండల విద్యాశాఖ అధికారి సమక్షంలో ఉపాధ్యాయులతో ఫోటోలు దిగి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగన్ మోహన్ రావు ఉపాధ్యాయిని వా. అరుణ తోపాటు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గోపికృష్ణ టైలర్ దాసు తోపాటు తదితరులు పాల్గొన్నారు..


# విద్యార్థులకు యూనిఫాం, స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమం



కారేపల్లి సెప్టెంబర్ 2 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల పరిధిలో భిక్యతండా గ్రామం,అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ, పరిధిలోని ఎంపీపీఎస్ భిక్యతండా పాఠశాలలో విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న యూనిఫాంల పంపిణీతో పాటు స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఖమ్మంకు చెందిన ఎవర్ గ్రీన్ ప్రాజెక్ట్ రియల్ ఎస్టేట్ వారి ఆర్థిక సహాయంతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేయడం జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్థిక సహాయం అందించిన పర్సగాని నాగేశ్వర రావు కి, దావా సత్యనారాయణకి అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. అలాగే పాఠశాల హెచ్‌ఎం వనజరాణి, శోభారాణి విద్యార్థులపై చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధకు, వారి విద్యాభివృద్ధి సంక్షేమం కోసం చేస్తున్న కృషికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్ ,ఎంఈవో జయరాజు , కార్యదర్శి కృష్ణవేణి ,కాంప్లెక్స్ హెచ్‌ఎం సాల్మన్ రాజ్ , హెచ్‌ఎం వనజరాని శోభారాణి , డాక్టర్ బిందు , గ్రామ పెద్ద శ్రీ బిచ్చు నాయక్ , వార్డు సభ్యులు మాలోత్ విజయ , శ్రీ వంకుడోత్ రమేష్ , సీసీ శ్రీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ 17వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

**కొల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం**



భద్రాచలం సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని భద్రాచలం ఓల్డ్ మార్కెట్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వై ఎస్ ఆర్ సీ పీ అధ్యక్షుడు కొల్లి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్ఆర్ చేసిన కృషిని నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పోటీ ప్రపంచంలో గెలుపు భవిష్యత్తుకు విజయ వారధి

## ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్







భద్రాచలం సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. ప్రాథమిక స్థాయిలో నైపుణ్యాలను పెంచేందుకు ప్రవేశపెట్టిన ఉద్దీపకం-1, ఉద్దీపకం-2, ఉద్దీపకం-3 పుస్తకాలను రూపొందిచంగా గిరిజన చిన్నారుల విద్యాభివృద్ధి మెరుగుపడి అనుకున్న దానికంటే ఎక్కువగానే సత్ఫలితాలు సాధించామని,తాజాగా విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా వారధి అనే పుస్తకాన్ని రూపొందించి పోటీ ప్రపంచంలో విజయం సాధించి వారి భవిష్యత్తును విజయతీరాలకు వెళ్లే విధంగా రూపొందించింది వారధి పుస్తకమని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ అన్నారు. బుధవారం బీఈడీ కళాశాలలో గిరిజన సంక్షేమ శాఖ ప్రైమరీ పాఠశాలల్లో విద్యా బోధన చేస్తున్న ఇంగ్లీష్, గణితం సబ్జెక్ట్ టీచర్ల వారధి పుస్తకం పై నిర్వహించిన ఒకరోజు శిక్షణలో ఆయన పాల్గొన్నారు. శిక్షణ ప్రారంభానికి ముందు చదువుల మాత సరస్వతి చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి వెలిగించిన అనంతరం ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విద్యార్థుల పటన సామర్థ్యాలను పెంచేందుకు అలాగే పదోతరగతి అనంతరం పాలిటెక్నిక్, గురుకులం, ఆర్మీ, పోలీస్, ఆర్ఆర్బీ పోటీ పరీక్షల్లో నెగ్గేలా గిరి జన విద్యార్థుల కోసం వారధి పుస్తకం తయారు చేశారు. వేసవి సెలవుల్లో ఐదుగురు ఉపాధ్యాయులు కసరత్తు చేసి ఇంగ్లీష్, రీజనింగ్, లాజికల్, అర్థమెటిక్ తదితర అంశాలతో పుస్తకాన్ని రూపొందించామని ఆయన అన్నారు.ఓఎంఆర్ షీట్ తరహాలో ప్రాక్టికల్ టెస్టులను సైతం అందుబాటులో ఉంచామని,ఉమ్మడి జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని అన్ని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో ప్రైమరీ విద్యార్థులతో పాటు పదవ తరగతి పిల్లలకు కూడా వారధి పుస్తకంపై వారంలో మూడు క్లాసులు నిర్వహించడం జరుగుతుందని ఆయన అన్నారు. సంబంధిత ప్రధానోపాధ్యాయులు సబ్జెక్ట్ టీచర్లు గిరిజన పిల్లలను మీ పిల్లల వలె భావించి ఉద్దీపకం వర్క్ బుక్ ఒకటి, రెండు, మూడు లోని అంశాలు ఏ విధంగా బోధించారో వారధి పుస్తకంలోని కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన ప్రతి అంశం విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని అందుకు హెచ్ఎం ప్రత్యేక బాధ్యత తీసుకొని వచ్చే సోమవారం నుండి క్లాసులు నిర్వహించాలని ఆయన అన్నారు. హెచ్ఎంలు ఆశ్రమ పాఠశాలల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి వర్షాలు కురుస్తున్నందున ఆశ్రమం పాఠశాలలో చదివే పిల్లల ఆరోగ్య స్థితిగతులపై సంబంధిత హెచ్ఎం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ముఖ్యంగా పాఠశాలల్లో మెనూ ప్రకారం పిల్లలకు సమయానుకూలంగా ఆహారం అందించాలని పిఓ తెలిపారు. ఆశ్రమ పాఠశాలలపై మంత్రులు ఎంపీలు ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖులు సందర్శించినప్పుడు వారు అడిగిన ప్రతి అంశాన్ని నిస్సందేహంగా సమాధానాలు చెప్పాలని ముఖ్యంగా మెనూ నిత్యవసర సరుకుల స్టాక్ పై వారి దృష్టి ఉంటుందని ఎటువంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని అన్నారు. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి టీచర్లను సర్దుబాటు చేస్తామని పిల్లలకు ఇబ్బందులు కలగకుండా పాఠశాలల్లో మైనర్ రిపేర్లు ఏమైనా ఉంటే వెంటనే చేయించుకోవాలని ఆయన హెచ్ఎం లకు సూచించారు. అనంతరం అందరి సమక్షంలో వారదీపుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం వారధి పుస్తకం రూపకర్త చేసిన పిఓను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని చందన, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, ఏ సి ఎం ఓ లు రమేష్, రాములు, ఏటీడీవో చంద్రమోహన్, డి ఈ విజయ్ కుమార్, జి సి డి ఓ అలివేలు మంగతాయారు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు ఇంగ్లీష్ గణితం సబ్జెక్ట్ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి ఎం హెచ్ ఓ డాక్టర్ తుకారం రాథోడ్..





భద్రాచలం సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (ఐవీఎూ) డాక్టర్ తుకారామ్ రాథోడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏటపాక మండలం, గొన్సగుప్ప గ్రామంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహానికి చెందిన విద్యార్థులకు సంబంధించిన ఘటన నేపథ్యంలో భద్రాచలం ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.వసతి గృహంలో జ్వర కేసులు నమోదైన నేపథ్యంలో, మలేరియా నివారణ చర్యల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ వైద్య శిబిర సిబ్బంది క్లోరోక్విన్ మాత్రలు అందించారు. అనంతరం మొత్తం 52 మంది వసతి గృహ విద్యార్థులను భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు.ఈ 52 మంది విద్యార్థుల్లో 9 మందికి మాత్రలు తీసుకున్న అనంతరం దుష్ప్రభావాలు మరియు ఆందోళన లక్షణాలు కనిపించాయి. జమున అనే విద్యార్థినిని ఆసుపత్రికి తీసుకురాగానే మృతిచెందిన స్థితిలో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మిగిలిన విద్యార్థులను ఆసుపత్రి వైద్య బృందం పరీక్షించి, చికిత్స అందిస్తూ పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అనంతరం ఐవీఎూ, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, వీూఎౌలు/ మీలు సూపర్‌వైజర్లు (ాఖూం)తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పర్యవేక్షణ మరియు నిర్వహణపై చర్చించారు. =ఐ పరీక్షల్లో మలేరియా పాజిటివ్‌గా నిర్ధారణైన కేసులకు తప్పనిసరిగా రక్తపు స్మియర్ (దీూ) నమూనాలు సేకరించి, నిబంధనల ప్రకారం జిల్లా రాష్ట్ర స్థాయి ప్రయోగశాలల్లో క్రాస్ వెరిఫికేషన్ కోసం పంపాలని సిబ్బందిని ఆదేశించారు. పోషకాహార వారోత్సవాల రెండో రోజు సందర్భంగా ఐవీఎూ సమతుల్యమైన పోషక విలువలతో కూడిన ఆహారం ప్రాముఖ్యతను వివరించారు. అవసరమైన పోషకాలు తగిన మోతాదులో తీసుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే, ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమాలపై కూడా సమీక్ష నిర్వహించారు. నేత్రదానం ప్రాముఖ్యత, దాని ద్వారా చూపు పునరుద్ధరణకు కలిగే ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.పై ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, సమాజంలో క్రమం తప్పకుండా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐవీఎూ అన్ని శాఖల సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ తోపాటు అడిషనల్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి (గిరిజన) డాక్టర్ సైదులు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీధర్ భద్రాచలం వారు పాల్గొని సమీక్షా చెయ్యడం జరిగింది. ఇందులో జిల్లా ల్యాబ్ టెక్నీషియన్లు సబ్ యూనిట్ అధికారులు ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్.ఆర్.బి.జి.ఎన్.ఆర్ కళాశాల పి.డి కి ఘన సన్మానం



ఖమ్మం సెప్టెంబరు 02 నిర్భయవార్త రిపోర్టర్. ఫిజికల్ ఎడ్యుకేషన్ వెంకన్నకు సన్మానం ఇటీవల జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నుండి రాష్ట్ర స్థాయి ధ్యాన్ చంద్ ఎక్సిలెన్సీ అవార్డు ను అందుకున్న ఎస్ ఆర్ బి ఐజి ఎన్ ఆర్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ బట్టు వెంకన్నను కళాశాల ప్రిన్సిపాల్ డా.మొహ్మద్ జాకిరుల్లా బుధవారం ఘనంగా సన్మానించారు.విద్యర్థలను రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వివిధ క్రీడాంశాల్లో నిష్ణాతులను చేస్తూ క్రీడా ంశాల్లో తీర్చిదిద్దుతున్నందుకు ఈ పురస్కారాన్ని అందజేశారని ప్రశంసించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ ఏ ఎల్ ఎన్ శాస్త్రి,డా.శ్రీనివాస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ డా.రమాసత్యవతి,ఐ.క్యుఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద, అకడమిక్ కోఆర్డినేటర్ డా.జి.వీరన్న పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ఆర్ వర్ధంతి - వెంకటాపురంలో కాంగ్రెస్ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ



ములుగు సెప్టెంబర్ 2 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) దివంగత ముఖ్యమంత్రి, మాజీ ప్రజల నాయకుడు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా వెంకటాపురం మండలంలో ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బుధవారం ఉదయం వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణనుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ, ప్రధాన వీధుల మీదుగా సాగి అంబేద్కర్ సెంటర్ వద్దకు చేరుకుంది. ర్యాలీలో దాదాపు 200కు పైగా బైకులపై కార్యకర్తలు, అభిమానులు పాల్గొని "జోహార్ వైఎస్ఆర్" అంటూ నినాదాలు చేశారు.అనంతరం వైఎస్ఆర్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సయ్యద్ హుస్సేన్ మాట్లాడుతూ, వైఎస్ఆర్ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందాయని, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్ మెంట్, 108, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ఆయన మానస పుత్రికలే అని కొనియాడారు. వైఎస్ఆర్ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులుసయ్యద్ హుస్సేన్, మండల ఎస్సి సెల్ అధ్యక్షులు చిట్యాల సాగర్, పి ఏ సి ఎస్ చైర్మన్ చిడం మోహన్ రావు,యూత్ కాంగ్రెస్ నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు బాలసాని వేణు, మన్యం సునీల్, గరపాటి రవి ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఫుడ్ పాయిజన్‌తో ఆసుపత్రిలో చేరిన చిన్నారులను పరామర్శించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ...







భద్రాచలం, సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి.భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక మండలం గొల్లగుప్ప గ్రామానికి చెందిన కొంతమంది చిన్నారులు ఫుడ్ పాయిజన్ కారణంగా భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని, వారిని పరామర్శించారు.చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు , వారికి అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. చిన్నారులకు మెరుగైన వైద్యం, అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.చిన్నారుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, పార్టీ నాయకులు భోగాల శ్రీనివాస్ రెడ్డి, రత్నం రమాకాంత్, చింతీరాల రవి కుమార్, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, చింతాడి చిట్టిబాబు, పెద్దినేని శ్రీనివాస్, యండి జిందా, చాట్ల రవి, రసమళ్ల రాము, బషీర్, యూత్ నాయకులు గాడి విజయ్, మాచినేని భాను తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడుల్లో మత ప్రచారాలు చేపిస్తారా: ఎమ్మెల్సీ ఆగ్రహం



పటాన్ చెరువు సెప్టెంబర్ 2 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: ప్రభుత్వ బడుల్లో మతప్రచారాలు ఎలా ప్రోత్సహిస్తారు అని, విద్యార్థినూల పుస్తకాలతో పాటు ఇతర మతాలకు చెందిన పుస్తకాలు పాఠశాలలోకి ఎలా అనుమతిస్తారని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు! చిట్కుల్ బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యా, బోధన తీరు మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వాళ్ళ బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు అందూర్ నర్సింగ్ రావు, కావలి వీరేష్, రాజశేఖర్ రెడ్డి, కావలి ఐలేష్, నరేష్ కుమార్ యాదవ్, ప్రవీణ్ కుమార్ యాదవ్,సందీప్ గౌడ్ తదిరులు నాయకులు పాల్గొన్నారు.

# కారేపల్లి లో ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగ

**స్వతంత్రం రాకముందు నుంచే ఆనవాయితీగా అమ్మవారికి బోనాల సమర్పణం.**



కారేపల్లి, సెప్టెంబర్ 2: నిర్భయవార్త రిపోర్టర్. కారేపల్లి గ్రామంలో మంగమ్మ గడ్డ నందు ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గాదె సుబ్బయ్య, కేశగాని బాలకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చి ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు.స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే కారేపల్లి గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించే ఆనవాయితీ కొనసాగుతోందని గ్రామ కుల పెద్ద ఆదేర్ల అంజయ్య తెలిపారు. ప్రతి సంవత్సరం భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రత్యేకంగా ప్రార్థించారు. బోనాల పండుగ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. నిర్వాహకులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

# అశ్వారావుపేట అగ్రికల్చర్ కాలేజీలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**--- అపరిచిత లింకులు, నకిలీ కాల్స్‌తో జాగ్రత్త: పాల్వంచ డిఎస్పీ ఆర్. సతీష్ కుమార్**




అశ్వారావుపేట సెప్టెంబర్ 2 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి ) సాంకేతిక పరిజ్ఞానాన్ని మంచికి ఉపయోగించాల్సిన యువత, సైబర్ నేరగాళ్ల మాయమాటల వలలో పడి మోసపోవద్దని పాల్వంచ డిఎస్పీ ఆర్. సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. అశ్వారావుపేట మండల కేంద్రంలోని వ్యవసాయ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఎస్పీ సతీష్ కుమార్, నేటి డిజిటల్




యుగంలో జరుగుతున్న వివిధ రకాల సైబర్ మోసాలు మరియు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైబర్ నేరగాళ్లు అమాయకులే లక్ష్యంగా రోజుకో కొత్త పంథాలో మోసాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా చదువుకున్న యువత, విద్యార్థులు క్రింది అంశాల పట్ల ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు: డిజిటల్ అరెస్ట్ భయాలు వద్దు, సీబీఐ, ఈడీ, పోలీస్ అధికారులమని చెప్పి వీడియో కాల్స్ చేసి భయపెట్టడం పూర్తిగా మోసమని, చట్టంలో "డిజిటల్ అరెస్ట్" అనేదే లేదని తెరిచి చెప్పారు. నకిలీ పార్ట్ టైమ్ జాబ్స్: టెలిగ్రామ్, వాట్సాప్‌లలో వచ్చే 'వర్క్ ఫ్రమ్ హోమ్' మెసేజ్‌లను నమ్మి ప్రారంభంలో వచ్చే చిన్న చిన్న లాభాలకు ఆశపడి పెద్ద మొత్తంలో డబ్బులు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, తక్కువ పెట్టుబడికి అధిక లాభాలు వస్తాయని చెప్పే నకిలీ ట్రేడింగ్ యాప్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ముఖ్యమైన సూచనలు, అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదని, ఒటిపి (ఌా), బ్యాంక్ వివరాలు, ఆధార్ సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, ఫ్రాడ్‌లు మరియు సోషల్ మీడియా బ్లాక్‌మెయిలింగ్ పట్ల సదా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్, అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు, ఎస్సైలు టి. యయాతి రాజు, దేవ్ సింగ్‌లతో పాటు సుమారు 200 మంది విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక బృందం ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ప్రభుత్వ,ప్రైవేటు ఉపాధ్యాయులకు ధ్యాన శిక్షణ

**ఉపాధ్యాయుల్లో మానసిక ప్రశాంతత,ఏకాగ్రత పెంపొందించడమే లక్ష్యం**



కారేపల్లి సెప్టెంబర్ 2 నిర్భయవార్త రిపోర్టర్. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ దుగ్గిరాల జయరాజు,కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షురాలు ముక్కా స్వరాజ్యలక్ష్మి తెలిపారు.బ్రహ్మశ్రీ పితామహ పత్రీజీ స్ఫూర్తితో కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థుల బోధనతో పాటు అనేక బాధ్యతలు నిర్వర్తిస్తున్న నేపథ్యంలో మానసిక ప్రశాంతత,ఏకాగ్రత,సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందించుకోవడంలో ధ్యానం దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఉద్యోగ,కుటుంబ బాధ్యతలతో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు బోధనలో మరింత ఏకాగ్రత సాధించేందుకు ధ్యానం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.విద్యార్థులకు ఎలా నేర్పాలో ఉపాధ్యాయులకు శిక్షణ ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు స్వయంగా ధ్యానం చేయడం నేర్చుకోవడంతో పాటు పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానాన్ని ఏ విధంగా పరిచయం చేయాలి,పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా ఎలా బోధించాలి,వారిలో ఏకాగ్రత,ప్రశాంతత,క్రమశిక్షణ,సానుకూల ఆలోచనలు పెంపొందించేలా ధ్యాన సాధనను ఎలా అలవాటు చేయాలి అనే అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.శిక్షణ పొందిన ఉపాధ్యాయులు అనంతరం తమ పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యానంపై అవగాహన కల్పించి,ధ్యాన సాధన పద్ధతులను నేర్పేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.తద్వారా ఉపాధ్యాయులకే కాకుండా విద్యార్థులకు కూడా ధ్యానం ప్రయోజనాలు చేరవేయడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు.చదువుపై ఏకాగ్రత పెంపొందించుకోవడం,ప్రశాంతంగా ఆలోచించడం,ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగడం వంటి అంశాలపై విద్యార్థులకు ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేసే విధానాన్ని శిక్షణలో వివరించనున్నట్లు తెలిపారు.ఈ ధ్యాన శిక్షణ కార్యక్రమానికి పిరమిడ్ సేవాదళ్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ పరమేశ్వర్ రెడ్డి,పీఎంసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బుద్ధ, భూపతిరాజు హనుమంతరావు,రమేష్ తదితరులు హాజరై ధ్యానం ప్రాధాన్యత,ఆచరణ విధానం,విద్యార్థులకు ధ్యానాన్ని బోధించే పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.కారేపల్లి మండల పరిధిలోని ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే ధ్యాన శిక్షణ కార్యక్రమంలో పాల్గొనాలని ఎంఈఓ దుగ్గిరాల జయరాజు,కారేపల్లి పిరమిడ్ సేవాదళ్ అధ్యక్షురాలు ముక్కా స్వరాజ్యలక్ష్మి కోరారు.

# వైఎస్సార్ సంక్షేమ పాలన తెలుగు రాష్ట్రాల చరిత్రలో స్వర్ణయుగం

**మాజీ సీఎం డా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంత్రి సీతక్క నివాళులు**



ములుగు, సెప్టెంబర్ 2 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలన తెలుగు రాష్ట్రాల చరిత్రలో 'సంక్షేమ స్వర్ణయుగం'గా నిలిచిపోయిందన్నారు. 2004 నుంచి 2009 వరకు ఆయన సాగించిన సంక్షేమ పాలనలో పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా అనేక విప్లవాత్మక పథకాలను ప్రవేశపెట్టి కోట్లాది మంది జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని పేర్కొన్నారు.వైఎస్సార్ హయాంలో ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 అత్యవసర సేవలు, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, రెండు రూపాయలకే కిలో బియ్యం, వృద్ధాప్య పింఛన్లు తదితర అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని మంత్రి సీతక్క అన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాలు నేటికీ తెలుగు ప్రజల జీవితాల్లో కొనసాగుతున్నాయని, ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లాడి రాంరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ స్టేట్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురంలో ఇంటి దొంగతనం కేసు ఛేదన ముగ్గురు అరెస్ట్ ఎస్సై కె తిరుపతి రావు




ములుగు సెప్టెంబర్ 2 (నిర్భయ వార్త జిల్లా ప్రతినిధి) వెంకటాపురం మండల కేంద్రంలో ఇండియన్ ఆయిల్ బంక్ గ్రామ శివారులో 2025 ఏప్రిల్ 13వ తేదీన సుంక హేమ సుందర్ ఇంట్లో దొంగతనం జరిగింది. కేసు నెం :86/2025, యు/ఎస్ 331(3), 305, బి ఎన్ ఎస్ ప్రకారం కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.ఎస్సై కె తిరుపతి రావు కేసు చెదిం చటానికి శాస్త్రీయ పద్ధతుల దృష్ట్యా వచ్చిన క్లూస్ టీం తో సహా ఈరోజు అనగా బుధవారం ఉదయం 9:00గంటల సమయంలో నమ్మదగిన సమాచారం మేరకు తన సిబ్బంది తో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో నిందితుణ్ణి పట్టు కొని అరెస్టు చేశారు. విచారణ లో భాగంగా నిందితుడి పేరు పుప్పాల సాయి ప్రకాష్, తండ్రి వెంకటేశ్వర రావు,వయసు 31,సంవత్సరాలు, కులం మున్నూరు కాపు, వృత్తి రైతు, హౌస్ నెం,8/4 గుట్ట పారా ప్రవీణ్ చంద్ర బంజ్ దేవ్ వార్డు, భూపాలపట్నం గ్రామం, బీజపూర్ జిల్లా,చతీష్ ఘడ్ రాష్ట్రం అని చెప్పడం జరిగిందని తెలిపారు. పుప్పాల సాయి ప్రకాష్ వెంకటాపురం ఏప్రిల్ 13 -2025తేదీనాడు వెంకటాపురం పరిది లో లాక్ చేసిన ఇంటి తాళం పగల గొట్టి బంగారం, వెండి, ఆభరణాలు, నగదు 10,000/-రూపాయలు దొంగ తనం చేసినట్లు తెలిపాడు. తాను నవంబర్ 2025లో ఏటూరునాగారం ట్రాక్టర్ దొంగతనం కేసులో జైలుకు వెల్లి నట్లు తెలిపారు. జైల్లో మరో వ్యక్తి దబ్బాకట్ల మనోజ్ పరిచయం అయ్యాడని చెప్పడం జరిగింది.జైలు నుండి రిలీజ్ అయినా తర్వాత దొంగతనం చేసిన సొమ్ము అమ్మకానికి దబ్బా కట్ల మనోజ్ ని సహకరించమని కోరాడు.అతను దానికి ఒప్పుకొని అతనికి తెలిసిన శ్యామల శ్రీనివాస రావు, రెవిన్యూ గ్రామం వరంగల్,అనే వ్యక్తి ద్వారా అమ్మకానికి పథకం తో మిగతా ఇద్దరినీ కలవడానికి వచ్చి వెంకటాపురం బస్ స్టాండ్ వద్ద పోలీసులకు పట్టు బడ్డాడని ఎస్సై కె తిరుపతి రావు తెలిపారు. వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్న సొమ్ము వివరాలు ూ1) పుప్పాల సాయి ప్రకాష్ వద్ద నుండి బంగారం, వాటి విలువ సుమారు 100,750/-ఉంటుందని, వెండి, 51, 630/-ఉంటుందని తెలిపారు.ఈ సందర్బంగా ఎస్సై కె తిరుపతి రావు మాట్లాడుతూ ఎవరైనా బయటకు వెళ్లే సమయంలో తమ వస్తువులును జాగ్రత్త పరుచుకోవాలని తెలిపారు. మీ ఇంటి చుట్టూ ప్రక్కన ఎవరైనా అనుమానస్పదవ్యక్తులు కనబడితే వెంటనే పోలీస్ శాఖ వారికీ సమాచారం ఇవ్వాలని కోరారు.నేరాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా నిరంతరం కొనసాగతుందని తెలిపారు.అరెస్టు చేసిన వ్యక్తిని కేసు నమోదు చేసి కోర్టు కు హాజరు పరచనున్నట్లు తెలిపారు. కేసు చెందించిన ఎస్సై కె తిరుపతి రావు ని,వారి సిబ్బందిని అభినందినట్లు తెలిపారు.

# ఆరు గ్యారంటీలు.. 420 హామీలు ఏమయ్యాయి?"



మెదక్ టౌన్ :-నిర్భయవార్త ప్రతినిధి : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్‌రెడ్డి, తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి పార్టీ శ్రేణులతో కలసి మెదక్ హెడ్ పోస్టాఫీసు వద్ద అంబేద్కర్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన అమలు కానీ హామీలు 420 అడుగుల పొడవైన ఫ్లెక్సీతో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ధర్నా చేపట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలుపై వివరాలతో రూపొందించిన 'బాకీ కార్డులను' ప్రజలకు పంపిణీ చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.

ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 33 నెలలు, దాదాపు వెయ్యి రోజులు పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చలేదని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ ఉందో లెక్కలతో వివరించేందుకే 'బాకీ కార్డులు' పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పటివరకు చెల్లించాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం బకాయి పెట్టిందని ఆరోపించారు. అధికారంలోకి రాగానే పింఛన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని చెప్పి అమలు చేయలేదన్నారు.కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు."మాటలు కోటలు దాటుతున్నాయి.. కాళ్లు మాత్రం కదలడం లేదు" అన్న చందంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగుతోందని విమర్శించారు. మాటలతో కాలం గడుపుతున్నారని ఆరోపించారు.

రైతులకు రైతుబంధు, రైతుబీమా సక్రమంగా అందడం లేదని ఆమె ఆరోపించారు. యూరియా కోసం ఆన్‌లైన్ విధానాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రైతుల కళ్లల్లో కన్నీళ్లు కనిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వం వైపు చూస్తున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయితే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

అనంతరం మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. రైతులకు రుణమాఫీ సక్రమంగా జరగలేదని, రైతుబంధు, రైతుబీమా విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు.అన్ని వర్గాల ప్రజలు మళ్లీ కేసీఆర్ వైపు చూస్తున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు.ఈ సందర్బంగా బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులు పూర్తవుతున్నా ప్రజలకు చెప్పుకోదగ్గ మేలు జరగలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏ విధంగా బాకీ పడిందో వివరాలను 'బాకీ కార్డు' రూపంలో ప్రజలకు అందించి వివరిస్తున్నామని తెలిపారు.అమలు చేయని హామీలను నెరవేర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని, అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచైనా ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా పోరాడతామని అన్నారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, త్వరలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్లు ఆరేళ్ల.మల్లికార్జున్ గౌడ్,బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు ఆకిరెడ్డి కృష్ణ రెడ్డి,పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ళ. ఆంజనేయులు కౌన్సిలర్లు జుబేర్ అహ్మద్ దీపక్,కుమార్ సోహెల్, హవెలిఘనపూర్,శంకరంపేట్ ఆర్ మండల పార్టీ అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, పట్లోరి. రాజు, రామాయంపేట రామాయంపేట మాజీ ఎంపీపీ పుట్టి.విజయలక్ష్మి,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగా.నరేందర్, మాజీ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని మాజీ సర్పంచ్లు,ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో కనీస అవసరాలను పరిశీలించిన ఎంపీడీవో



గుమ్మడిదల సెప్టెంబర్ 2 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: పటాన్ చెరువు నియోజకవర్గం గుమ్మడిదల మండలం నల్లవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుమ్మడిదల మండల విస్తరణ అధికారిని ఉమాదేవి నల్లవల్లి గ్రామాన్ని స్థానిక సర్పంచి తో సందర్శించి గ్రామ ప్రజలకు కావలసిన కనీస వసతుల గురించి మరియు జిల్లా ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కనీస అవసరాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులతో, చర్చించి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని అలాగే ప్రోటీన్లతో కూడిన ఆహారాన్ని గుడ్లు, పాలమృతాన్ని ఆహారంలో భాగంగా నిత్యం పిల్లలకి అందించాలని, బుధవారం నాడు స్థానిక పంచాయతీ పాలకవర్గంతో కలిసి మధ్యాహ్నం భోజనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ పోచయ్య పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదిరులు పాల్గొన్నారు.

## ఐటిఐ ఏటీసీ ట్రేడ్లలో గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అవకాశాలు కల్పన ఐటీడీఏ పిఓ బి రాహుల్




భద్రాచలం సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. కృష్ణ సాగర్ ఆర్ ఐ టి ఐ లో నూతనంగా ప్రవేశపెట్టిన ఏ టి సి శిక్షణ ద్వారా గ్రామీణ యువతకు వివిధ రకాల ట్రేడ్లలో శిక్షణ అందించడానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. బుధవారం రాత్రి తన చాంబర్లో ఐటిఐ ప్రిన్సిపాల్ సమక్షంలో ఏ టి సి అడ్మిషన్లకు సంబంధించిన వాల్పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిసి కోర్సులలో చేరే యువకులకు అధునాతన పరికరాలను ఉపయోగించే ఆర్టిసాన్, ఇండస్ట్రియల్ మరియు డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికిల్, సిఎంసి మ్యాచింగ్ టెక్నీషియన్, స్కానర్ బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైయర్ వంటి కోర్సులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించి శిక్షణ అందించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ నెల 5వ తేదీ వరకు సంబంధిత గ్రామీణ యువకులు ఏ టి సి కోర్సులలో చేరే విధంగా సంబంధిత గ్రామాల ఉద్యోగులు స్వయం సహాయక మహిళలు గ్రామీణ యువకులను గుర్తించి ఆర్ ఐ టి ఐ కృష్ణ సాగర్ దరఖాస్తులు చేసుకునేలా చొరవ చూపాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐటిఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్రావు ఐటిఐ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈనెల 15 వరకు అవకాశం




సంగారెడ్డి సెప్టెంబర్ 2 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఓపెన్ స్కూల్ ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. జాయిశీట్ డైరెక్టర్ రాంజీ సూచనల మేరకు అర్హులైన విద్యార్థులు విద్యాభ్యాసం మధ్యలోనే నిలిచిపోయిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బుధవారం నాడు సూచించారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ అవకాశం ఉందని అధికారులు తెలిపారు

## సంక్షేమ పథకాలకు పాతర.. కాంగ్రెస్ పాలనలో కమిషన్ల జాతర వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ సమరభేరి

### చర్ల నుంచి భద్రాచలం వరకు భారీ బైక్ ర్యాలీ



చర్ల, సెప్టెంబర్ 2 నిర్భయ వార్త ప్రతినిధి. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనకు నిరసనగా బుధవారం చర్ల నుంచి భద్రాచలం వరకు సుమారు 200 ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపు మేరకు చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గులాబీ జెండాలు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. రైతు భరోసా, కల్యాణలక్ష్మి, తులం బంగారం, ఆసరా పింఛన్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతకు ఉద్యోగాలు తదితర హామీలను ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రజలకు వివరిస్తూ ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చేగుంటలో వైఎస్సార్, చెరుకు ముత్యం రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా




చేగుంట:నిర్భయవార్త ప్రతినిధి చేగుంట మండల కేంద్రంలోని గాంధీ బొమ్మ చౌరస్తా వద్ద మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతితో పాటు మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెరుకు ముత్యం రెడ్డి 7వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువురు నేతల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తుచేశారు. అదేవిధంగా చెరుకు ముత్యం రెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్ కుమార్, చేగుంట సీనియర్ నాయకుడు సతీష్, సండ్రుగు శ్రీకాంత్, వడియారం సర్పంచ్, సాయి కుమార్ గౌడ్, చేగుంట ఉపసర్పంచ్ రఫిక్, చేగుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ స్టాలిన్ నరసింహులుతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సదాశివపేట పట్టణంలోశ్రావణమాసం సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో భక్తి కార్యక్రమాలు



సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాసదాశివపేట పట్టణంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సదాశివపేట వీరశైవ లింగాయత్ మహిళా ఆధ్వర్యంలో స్థానిక శ్రీ బసవేశ్వర మందిరంలో ప్రతిరోజూ భక్తి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వీరశైవ లింగాయత్ సమాజం అధ్యక్షులుగందిగరాజు తెలిపారు. ఈ సందర్భంగా భజన కార్యక్రమంలలితా సహస్రనామ పారాయణం, మహా మృత్యుంజయ జపంపంచాక్షరిజపం హనుమాచాలీసా తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి కార్యక్రమాలను విజయవంతం చేస్తున్నారని, శ్రావణమాసంలో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని తీసుకురావడమే కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

# పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల విద్యాధికారి సదాశివపేట్ మండల విద్యాధికారి శంకర్




సదాశివపేట నిర్భయవార్త ప్రతినిధి : సంగారెడ్డి జిల్లాసదాశివపేట మండల విద్యాధికారి యన్ శంకర్ బుధవారం రోజు మండలంలోని నాగులపల్లి, కొనాపూర్, అరూర్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో ఎఫ్ ఎల్ ఎన్ కి సంబంధించిన అంశాలు, రికార్డుల నిర్వహణ, అలాగే ఎఫ్ ఎల్ ఎన్ లో భాగంగా చేపట్టిన రెమిడియేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారునాగులపల్లి పాఠశాలలో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. కొనాపూర్, అరూర్ పాఠశాలల్లో బోధన చేస్తున్న ఉపాధ్యాయుల బోధనా తీరును ప్రశంసించారు. అరూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం, గుడ్లు, రాగి జావా తప్పనిసరిగా అందించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారుఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎన్ శంకర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని, ఎఫ్ ఎల్ ఎన్ అమలులో సంగారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ముందంజలో ఉండే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలప్రధానోపాధ్యాయులు జయకృష్ణపద్మ, కృష్ణవేణి మరియు ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంపాల్గొన్నారు.

# పాఠశాల యూనిఫాం విద్యార్థులకు అందజేత




చౌటకూర్//నిర్భయవార్త ప్రతినిధి :, సెప్టెంబర్ 2 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులకు కుట్టించిన యూనిఫాం దుసు బిలను బుధవారం అందజేశారు. విద్యార్థులకు టైలర్ల వద్ద కుటించిన దుస్తుల నాణ్యత ప్రమాణాలను పరిశీలించిన అధికారులు చౌటకూర్ మండలం సుల్తాన్పూర్ జిల్లా ప్రజా పరిషతు ఉన్నత పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. యూనిఫాం బాగున్నాయా అంటూ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మందికి పంపిణీ చేస్తున్నారో ఆ పూర్తి వివరాలను ఆన్లైన్లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఇంకా మిగిలిపోయిన విద్యార్థులు ఎవరైనా ఉంటే వారికి కూడా కొలతలు తీసుకుని కుట్టించి పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం చంద్రశేఖర్, సీసీ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు..



మెదక్,టౌన్ :-నిర్భయవార్త ప్రతినిధి : పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మెదక్ మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ద్వారా నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, ఆపద సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈకార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు సహకారం.. సబ్ రిజిస్టర్ మాజీ అధికారి అరెస్టు.. ---నకిలీ పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకారం



కీసర సర్కిల్ నిర్భయవార్త ప్రతినిధి : మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ నకిలీ స్థిరాస్తి పత్రాల రిజిస్ట్రేషన్లకు సహకరించడంతో పాటు పలు స్థిరాస్తి మోసం కేసుల్లో కీలకంగా వ్యవహరించిన కీసర మాజీ సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ యూసుఫ్ ఉర్ రహ్మాన్‌ను కీసర పోలీసులు అరెస్టు చేశారు. ఆయనపై కీసర పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఏడు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సెప్టెంబరు 1న సాయంత్రం అదుపులోకి తీసుకుని విచారించిన అనంతరం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.

**రూ.4.11 కోట్ల రుణాల మోసం**

క్రైం నంబరు 928/2025 దర్యాప్తులో నకిలీ, తారుమారు చేసిన స్థిరాస్తి పత్రాలను సృష్టించి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వ్యక్తుల పేర్లపై గృహ రుణాలు పొందిన వ్యవస్థీకృత మోసం వెలుగుచూసింది. ఇప్పటివరకు 11 గృహ రుణ లావాదేవీల ద్వారా సుమారు రూ.4.11 కోట్లు మోసపూరితంగా పొందినట్లు పోలీసులు గుర్తించారు.

**పత్రాలే ఆధారంగా రుణాలు**

కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన పలు అనుమానాస్పద విక్రయ పత్రాలను నిందితులు అనంతరం బ్యాంకులు, గృహ రుణ సంస్థల్లో హామీ పత్రాలుగా ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలింది. నకిలీ లింకు పత్రాలు, సాధారణ అధికార పత్రాలు, వ్యక్తుల గుర్తింపు తారుమారు తదితర మార్గాల్లో రిజిస్ట్రేషన్లు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**రుణం తీసుకుని ఎగవేత**

మొదట కొంతకాలం వాయిదాలు చెల్లించి బ్యాంకులకు అనుమానం రాకుండా వ్యవహరించి, అనంతరం ఉద్దేశపూర్వకంగా వాయిదాలు నిలిపివేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. బ్యాంకులు నోటీసులు జారీ చేసిన తర్వాత ఆస్తులను పరిశీలించగా కొన్ని ఆస్తులు ఉనికిలో లేకపోవడం, సర్వే నంబర్లు, ప్లాట్ నంబర్లు, లింకు పత్రాల్లో తారుమార్లు చేసినట్లు బయటపడింది.

**కొనసాగుతున్న దర్యాప్తు**

కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోని అసలు రిజిస్ట్రేషన్ రికార్డులు, వేలిముద్రలు, జీవ గుర్తింపు వివరాలు, బ్యాంకు రుణ పత్రాలు, ఆర్థిక లావాదేవీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. పరారీలో ఉన్న ఇతర నిందితులను గుర్తించి అరెస్టు చేయడంతో పాటు మోసపూరితంగా పొందిన నగదు, ఆస్తుల వివరాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది అని పోలీస్ అధికారులు తెలిపారు.

# నిమజ్జన మార్గాలు, భద్రతపై అధికారులకు సూచనలు

## చెరువులను పరిశీలించిన డిప్యూటీ కమిషనర్...భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



దుండిగల్, నిర్భయవార్త ప్రతినిధి :వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను ముందుగానే పరిశీలిస్తూ అవసరమైన చర్యలను ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా డిప్యూటీ కమిషనర్ డాక్టర్ వెంకట మణి కరణ్ నిమజ్జనం నిర్వహించే పలు చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బౌరంపేట్ పెద్ద చెరువు, దుండిగల్ పెద్ద చెరువు, గాగిలాపూర్ కోతినార్ చెరువు, శంబిపూర్ షాకిన్ చెరువు, పోచంపల్లి కుడికుంట చెరువులను ఆయన సందర్శించారు. నిమజ్జన మార్గాల పరిశీలన: వినాయక విగ్రహాలతో వచ్చే ఊరేగింపులు సాగే మార్గాలను డిప్యూటీ కమిషనర్ పరిశీలించారు. చెరువుల వద్ద భక్తుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో చర్చించారు. నిమజ్జన ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి:**

నిమజ్జన ఊరేగింపుల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, నిమజ్జన కార్యక్రమం సజావుగా పూర్తయ్యేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు:**

నిమజ్జన ప్రాంతాల్లో భద్రత, రాకపోకలు, ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ వెంకట మణి కరణ్ అధికారులకు సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, అసిస్టెంట్ ఇంజనీర్లు సురేందర్ నాయక్, అశోక్ కుమార్, దుండిగల్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బాల్ రెడ్డి, ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



## పరికిణీలో పాల మీగడ లాంటి మేనిఛాయతో ఆకట్టుకుంటున్న కయాదూ లోహర్!

ఇటీవల కాలంలో హీరోయిన్లు ఒకవైపు గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ.. సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమా ప్రమోషన్స్ కూడా ఇదే ఇన్స్టాగ్రామ్ ద్వారా చేస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో హీరోయిన్లు ఒకవైపు గ్లామర్ తో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ.. సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను పెంచుకుంటూనే.. మరొకవైపు తమ సినిమా ప్రమోషన్స్ కూడా ఇదే ఇన్స్టాగ్రామ్ ద్వారా చేస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు ఇంటర్వ్యూలో పాల్గొంటూ.. మరొకవైపు ఇలా గ్లామర్ తో కూడా ప్రమోషన్స్ చేస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు.. అలాంటి వారిలో కయాదు లోహర్ కూడా ఒకరు. అందులో భాగంగానే ఇన్స్టాగ్రామ్ వేదికగా గత కొన్ని రోజులుగా వరుస గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈమె.. నేడు సాంప్రదాయంగా లంగా వోణీలో కనిపించి అభిమానులను ఆకట్టుకుంది. గోల్డెన్ కలర్ తో డిజైన్ చేసిన ఈ లంగా వోణీలో అమ్మడి అందం రెట్టింపు అవుతోందని చెప్పవచ్చు. జడ దువ్వుకొని కింద రిబ్బన్ కట్టుకొని చాలా అందంగా కనిపించింది కయాదు లోహర్. పాలమీగడ లాంటి మేని ఛాయతో





మైమరిపింప చేసింది. ముఖ్యంగా ఒకవైపు ఈమె నటిస్తున్న ది ప్యారడైజ్ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా ఇలా అందంగా తయారయింది అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. కానీ అసలు విషయం వేరే: మైత్రీ రవి నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న చిత్రం ది ప్యారడైజ్. ఇదివరకే వీరి కాంబినేషన్లో దసరా సినిమా వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇక అందుకే మళ్ళీ వీరిద్దరి కాంబినేషన్లో సినిమా ప్రకటించడంతో అంచనాలు భారీగా పెరిగిపోయాయి. దీనికి తోడు వీరిద్దరి కాంబినేషన్లో వస్తున్న ది ప్యారడైజ్ మూవీ నుండి విడుదల చేసిన ప్రతి అప్డేట్ కూడా సోషల్ మీడియాలో వైరల్ గా మారుతుంది. పైగా సినిమా నుండి విడుదల చేసిన పాటలు కూడా యూట్యూబ్లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. అలాంటి చిత్రంలో కయాదు లోహర్ హీరోయిన్గా అవకాశం అందుకుంది. ఈ చిత్రం సెప్టెంబర్ 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు రాబోతోంది . సోనాలి కులకర్ణి, మోహన్ బాబు, రాఘవ్ జుయల్ , సంపూర్ణేష్ బాబు , తనికెళ్ల భరణి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. పైగా ఈ సినిమాతో కయాదు లోహర్ మంచి విజయాన్ని అందుకోవాలని ఆశలు పెట్టుకుంది.. మరి ఆమెకు ఈ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి. కయాదు లోహర్ తదుపరి చిత్రాల విషయానికి వస్తే.. ఇటీవలే దుల్కర్ సల్మాన్తో కలిసి ఐయామ్ గేమ్ అనే చిత్రంలో నటించింది. సూర్య 48వ చిత్రంలో కూడా ఈమె హీరోయిన్గా నటిస్తోంది. హోం భలే ఫిలిమ్స్ బ్యానర్ పై టీజే జ్ఞానవేల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జీవి ప్రకాష్ కుమార్ హీరోగా వచ్చిన ఇమ్మోర్టల్ చిత్రంలో కూడా ఈమె హీరోయిన్గా నటించింది . ఇక అంతే కాదు మలయాళ చిత్రంతో పాటు మరో తమిళ చిత్రంలో హీరోయిన్గా అవకాశం అందుకుంది. నిజానికి ఇటీవల కాలంలో వరుస ఫ్లాప్ లు లభిస్తున్నప్పటికీ ఈమెకు హీరోయిన్గా వరుస అవకాశాలు లభిస్తూ ఉండడం గమనార్హం.

## యశ్.. పట్టుకునే డైరెక్టర్ ఎవరు?

పెద్ద స్టార్ హీరోల దగ్గర ఒక సినిమా పూర్తయ్యేలోపే తర్వాతి రెండు సినిమాలు లైన్లో ఉంటున్నాయి. కానీ యశ్ విషయంలో ఇప్పుడు పరిస్థితి కొంచెం వేరు. పెద్ద స్టార్ హీరోల దగ్గర ఒక సినిమా పూర్తయ్యేలోపే తర్వాతి రెండు సినిమాలు లైన్లో ఉంటున్నాయి. కానీ యశ్ విషయంలో ఇప్పుడు పరిస్థితి కొంచెం వేరు. 'టాక్సిక్' ఆగస్టు 26న థియేటర్లలోకి వచ్చింది. నితేశ్ తివారీ 'రామాయణ'లో రావణుడిగా యశ్కు ఇంకా పని ఉంది. అయితే అది యశ్ సోలో హీరోగా చేసే సినిమా కాదు. 'టాక్సిక్' తర్వాత సోలో హీరో ప్రాజెక్ట్ ఏంటన్నది మాత్రం ఇప్పటివరకు అధికారికంగా ప్రకటించలేదు. 00:00 / 02:25 యశ్ ఇలా టైమ్ తీసుకోవడం కొత్తేమీ కాదు. 'కేజీఎఫ్ 2' 2022లో వచ్చిన తర్వాత వెంటనే మరో సినిమా ఒప్పుకోలేదు. చాలా గ్యాప్ తీసుకుని గీతూ మోహన్దాస్తో 'టాక్సిక్' చేశాడు. అప్పట్లో కూడా పెద్ద కమర్షియల్ దర్శకుడిని ఎంచుకుంటాడని అనుకున్నారు. కానీ యశ్ మాత్రం వేరే ఛాయిస్ తీసుకున్నాడు. ఇప్పుడు మరోసారి అలాంటి గ్యాప్ వచ్చింది. మార్కెట్ ఉన్న హీరో రెడీగా ఉన్నా, అతనికి నచ్చే కథ ఎవరి దగ్గర ఉందన్నదే ప్రశ్న. మైత్రీ రవి ఈ మధ్య హేమంత్ ఎం.రావు పేరు యశ్తో గట్టిగానే వినిపించింది. 'సప్త సాగరదాచే ఎల్లో'తో గుర్తింపు తెచ్చుకున్న హేమంత్ దర్శకత్వంలో యశ్ సినిమా అంటూ టాక్ వచ్చింది. కానీ యశ్ టీమ్ నుంచి గానీ, హేమంత్ నుంచి గానీ సినిమా అనౌన్స్ కాలేదు. హేమంత్ ఇటీవల 'టాక్సిక్'పై పోస్ట్ చేయడంతో ఆ టాక్ మళ్లీ బయటకు వచ్చింది. తెలుగు దర్శకులకు కూడా యశ్ ఇప్పుడు మంచి ఆప్షనే. ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్, అల్లు అర్జున్, మహేష్ లాంటి హీరోల చేతుల్లో ఇప్పటికే పెద్ద సినిమాలు ఉన్నాయి. వాళ్ల డేట్స్ కోసం దర్శకులు సంవత్సరాల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. యశ్ మాత్రం తన తర్వాతి సోలో సినిమాను ఇంకా ప్రకటించలేదు. పాన్ ఇండియా మార్కెట్ ఉన్న హీరో కావడంతో తెలుగు నుంచి కూడా కథలు వెళ్లే అవకాశం లేకపోలేదు. అయితే యశ్ను ఒప్పించడం అంత ఈజీ కాదని 'టాక్సిక్'తోనే మరోసారి తెలిసింది. 'కేజీఎఫ్' తర్వాత అందరూ ఊహించిన దారిలో కాకుండా గీతూ మోహన్దాస్ను ఎంచుకున్నాడు. హైదరాబాద్ ఈవెంట్లో దిల్ రాజు కూడా అప్పట్లో ఆ కాంబో తనను ఆశ్చర్యపరిచిందని చెప్పారు. అంటే దర్శకుడి గత బాక్సాఫీస్ రికార్డు చూసి ఒప్పుకునే రకం కాదని అర్థమవుతుంది. ఇక యశ్ నెక్ట్స్'రామాయణ' పని పూర్తి చేయాల్సి ఉంది. పార్ట్ 2 కోసం రణబీర్ కపూర్తో యశ్ కీలక సన్నివేశాలు ఇంకా షూట్ చేయాల్సి ఉందట. ఆ ప్రాజెక్టు మధ్యలోనే కొత్త సినిమా ప్రకటిస్తాడా, లేక ఆ పని పూర్తయ్యాకే నిర్ణయం తీసుకుంటాడా అన్నది చూడాలి.



## పవన్ బర్త్ డే: అన్నా కొణిదెల పోస్ట్‌కు అభిమానుల నీరాజనం



ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు (2 సెప్టెంబర్) సందర్భంగా సోషల్ మీడియా వేదికగా అభిమానుల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన భార్య అన్నా కొణిదెల తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో పవన్ కళ్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ.. షేర్ చేసిన ఒక ఎమోషనల్ పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. -పవర్ స్టార్ ఎంతోమంది జీవితాలను తన ఆత్మీయ స్పర్శతో తాకారని.. ఎందరో ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారంటూ అన్నా లెజినోవా చేసిన పోస్ట్‌కు లక్షలాది మంది నెటిజనులు ప్రతిస్పందిస్తున్నారు. ముఖ్యంగా ఆలు మగలు ఇలా ఆహ్లాదంగా ఆదర్శవంతంగా ఉన్న ఫోటోగ్రాఫ్ ని షేర్ చేయగా దానికి లవ్, హార్ట్ ఈమోజీలతో అభిమానులు ప్రేమను కురిపిస్తున్నారు. ముఖ్యంగా అన్నా షేర్ చేసిన ఫోటోగ్రాఫ్ లో పవన్ తెల్ల కుర్తాలో ఎంతో సింపుల్ గా కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఒక డంబోకైనా అర్థం కావాలి సినిమా రంగంలో పవర్ స్టార్‌గా కోట్లాదిమంది అభిమానాన్ని గెలుచుకున్న పవన్ కళ్యాణ్.. రాజకీయాల్లోకి వచ్చి ప్రజా నాయకుడిగా మారిన తీరును అభిమానులు ఎంతో గర్వంగా స్మరించుకుంటున్నారు. నెటిజన్లు కామెంట్లలో ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా తమకు మార్గదర్శిగా, ఒక భావోద్వేగంగా అభివర్ణిస్తున్నారు. --సినిమాతో పరిచయమై... రాజకీయంలో మార్గదర్శకుడివి అయ్యావు-- అంటూ కామెంట్ల రూపంలో తమ గుండెల్లోని అభిమానాన్ని చాటుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా విదేశాల నుంచి కూడా పవన్ కళ్యాణ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. కామెంట్లలో ఒక అభిమాని స్పందిస్తూ... పవన్ కళ్యాణ్ జీవితంలో అన్నా కొణిదెల తోడుగా నిలవడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఒక గొప్ప ఆశాకిరణంగా నిలిచే నాయకుడికి జీవిత భాగస్వామిగా సరైన మద్దతు ఇస్తున్నారని కొనియాడారు. భాషలు, ప్రాంతాల సరిహద్దులు దాటి పవన్ కళ్యాణ్‌కు ఉన్న ప్రజాదరణకు ఈ వ్యాఖ్యలు అద్దం పడుతున్నాయి. కేవలం శుభాకాంక్షలతోనే ఆగిపోకుండా.. పవన్ కళ్యాణ్ ప్రజా సేవకుడు కావడంతో కొందరు తమ సమస్యలను, విజ్ఞప్తులను కూడా ఈ పోస్ట్ ద్వారా పవన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. అరుదైన డిఎండి వ్యాధితో బాధపడుతున్న తన కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ఒక తండ్రి చేసిన విజ్ఞప్తి అందరినీ కలచివేస్తోంది. పవన్ కళ్యాణ్ ఉదార హృదయంతో స్పందిస్తారనే నమ్మకంతోనే అభిమానులు ఇటువంటి అత్యవసర సాయం కోసం ఆయనను ఆశ్రయిస్తున్నారు. మొత్తానికి అన్నా కొణిదెల చేసిన ఈ ఒకే ఒక్క పోస్ట్ పవన్ కళ్యాణ్‌పై ఉన్న అపారమైన అభిమానాన్ని, నమ్మకాన్ని మరోసారి స్పష్టం చేసింది. అభిమానులు ఆయనను -అన్నయ్య-, -జనసేనాని-, -పిఠాపురం ఎమ్మెల్యే-, -ఉపముఖ్యమంత్రి- అని పిలుస్తూ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నారు. ఈ జన్మదిన వేడుకలు కేవలం ఒక నటుడి పుట్టినరోజుగా మాత్రమే కాకుండా.. ఒక ప్రజా నాయకుడికి ప్రజలు అందిస్తున్న ఘన నీరాజనంగా నిలిచాయి.

## పవన్ బర్త్డే ట్రీట్.. కేవలం అదొక్కటేనా?



ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఈ స్పెషల్ డే పవన్ నుంచి క్రేజీ అప్డేట్స్ వస్తాయని అభిమానులు ఆశించారు ముఖ్యంగా 'హ+ 2' సినిమా అప్‌డేట్ అర్ధరాత్రి రాకపోవడంతో ఫ్యాన్స్ తీవ్ర నిరాశకు గురయ్యారు.?సంగీత దర్శకుడు థమన్ గతంలో ఇచ్చిన హింట్స్ వల్ల పెద్ద ప్రకటన వస్తుందని ఆశించినా, కేవలం బర్త్‌డే పోస్టర్‌కే పరిమితం కావాల్సి వస్తుందని తెలుస్తోంది. సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని మేకర్స్ డేలోపు ఏదైనా సర్ప్రైజ్ ఇస్తారేమో చూడాలి.

## ది ప్యారడైజ్ : ఆ విషయంలో ఇంకా పట్టు బిగించాల్సిందే..!



నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై భారీ అంచనాలున్నాయి. సెప్టెంబర్ 24న విడుదల కానున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది.అయితే కేవలం ఆసక్తిని పెంచడమే కాకుండా, రాబోయే రోజుల్లో దూకుడుగా సాగే ప్రమోషన్లతో ఈ హైప్‌ను థియేట్రికల్ వేవ్‌గా మార్చాల్సిన అవసరం ఉంది.బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్ చేయాలంటే ఈ చిత్రం ఓ రేంజ్ లో ఎఫెక్ట్ చూపెట్టాలి. మరి నాని అండ్ టీమ్ ఈ విషయంలో రిలీజ్ కు ముందు ఎంత మేర హైప్ క్రియేట్ చేస్తారో చూడాలి.

## రెండు నగరాలు.. ఒకే జీవితం.. సూర్య- జ్యోతిక ముంబై- చెన్నై కనెక్షన్ అసలు కథ ఇదే!

చెన్నైతో ఉన్న అనుబంధాన్ని కంటిన్యూ చేస్తూనే ముంబైతోనూ స్ట్రాంగ్ కనెక్షన్‌ను కొనసాగిస్తున్న ఈ స్టార్ కపుల్ లైఫ్‌స్టైల్ ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారింది. సినిమా స్టార్ల జీవితం అంటే ఎప్పుడూ ఒకే నగరానికి పరిమితమై ఉండటం కష్టం. ముఖ్యంగా కెరీర్, కుటుంబం, పిల్లల చదువు, వ్యక్తిగత సంబంధాలు.. ఇలా ఒక్కో అవసరానికి ఒక్కో నగరం కీలకంగా మారుతుంది. ప్రస్తుతం హీరో సూర్య, నటి జ్యోతిక ఫ్యామిలీ విషయంలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. చెన్నైతో ఉన్న అనుబంధాన్ని కంటిన్యూ చేస్తూనే ముంబైతోనూ స్ట్రాంగ్ కనెక్షన్‌ను కొనసాగిస్తున్న ఈ స్టార్ కపుల్ లైఫ్‌స్టైల్ ఇప్పుడు ఇంట్రెస్టింగ్ గా మారింది. మైత్రీ రవి సూర్య తాజాగా తన నివాసంపై నెలకొన్న సందేహాలకు క్లారిటీ ఇవ్వడంతో ఈ డిస్కషన్ మరోసారి తెరపైకి వచ్చింది. తాను చెన్నైలోనే ఉంటున్నానని, ముంబైకి మాత్రం తరచూ ప్రయాణిస్తున్నానని ఆయన చెప్పడం ద్వారా.. ముంబైకి వెళ్లడం అంటే చెన్నైని పూర్తిగా వదిలేయడం కాదనే విషయం స్పష్టమైంది. అయితే ఈ కుటుంబానికి ముంబై ఎందుకు అంత ముఖ్యమైంది? అన్నది చూస్తే, దాని వెనుక కేవలం సినిమా పనులు మాత్రమే లేవు. జ్యోతిక పుట్టి పెరిగింది ముంబైలోనే. ఆమె తల్లిదండ్రులకు దగ్గరగా ఉండాలనే ఫ్యామిలీ డెసిషన్ కూడా ముంబైతో వారి అనుబంధాన్ని పెంచింది. పిల్లల చదువు, ఫ్యామిలీతో ఎక్కువ సమయం గడపడం వంటి అంశాలు కూడా ఈ డెసిషన్ లో కీలకంగా మారినట్లు సూర్య గతంలో వెల్లడించారు. మరోవైపు చెన్నై మాత్రం సూర్యకు కేవలం ఒక నగరం కాదు.. అతని సినీ ప్రయాణానికి, ఫ్యామిలీ లైఫ్ కు ఎన్నో ఏళ్లుగా బేస్‌గా ఉన్న ప్రాంతం. అందుకే ముంబైలో ఫ్యామిలీకి స్పెషల్ స్పేస్ ఏర్పడినా, చెన్నైతో ఉన్న బంధాన్ని మాత్రం వదులుకోలేదు. గతంలో సూర్య ముంబైలోని తమ చిన్న ఇంటి గురించి మాట్లాడుతూ, అక్కడి ప్రశాంతమైన కుటుంబ వాతావరణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఇక్కడే రెండు నగరాలు- రెండు అవసరాలు అనే కాన్సెప్ట్ ఆసక్తికరంగా మారుతోంది. చెన్నై సూర్య కెరీర్‌కు బేస్ అయితే.. ముంబై ఫ్యామిలీ బాండింగ్స్, పిల్లల లైఫ్, జ్యోతిక పర్సనల్ వరల్డ్ కు దగ్గరైన నగరంగా మారింది. అంటే ఇది ఒక నగరాన్ని వదిలి మరో నగరాన్ని ఎంచుకున్న కథ కాదు. అవసరానికి తగ్గట్టుగా రెండు నగరాలను తమ జీవితంలో భాగం చేసుకున్న ఫ్యామిలీ స్టోరీ. అందుకే సూర్య- జ్యోతిక విషయంలో ఎక్కడ ఉంటున్నారు? అనే ప్రశ్న కంటే.. రెండు నగరాలను ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు? అనేదే అసలు ఆసక్తికరమైన అంశంగా మారింది.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197